



శిథిలావస్థలో ఉన్న ఫిట్టర్, మెషినిస్టు తరగతి గదులు



అద్దె భవనంలో అరకొరవసతుల మధ్య నడుస్తున్న మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ

- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐ ప్రాంగణాలు
- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు
- కాంగ్రెస్ సర్కారూ పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు



పూర్తిగా పాతబడి పోయిన వరంగల్ ఐటీఐ భవనం



అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు

పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాత కాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు.. ఇవీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో కనిపిస్తున్న దుర్భర పరిస్థితులు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు కావడంతో అధ్వానంగా.. చూడడానికి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యార్థులకు వివిధ వృత్తుల్లో సాంకేతిక శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన ఉమ్మడిజిల్లాలో నిర్మించిన ఆరు ఐటీఐలు మారుతున్న కాలానికి అనుగుణంగా లేకపోవడం, నిధులు లేమి, ఫలితంగా రా మెటీరియల్ సరఫరా లేకపోవడం, టెక్నికల్ స్టాఫ్ సరిపడా లేకపోవడం పెద్ద సమస్యగా మారాయి. ఫలితంగా సరైన శిక్షణ పొందలేక.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను అంది అందిపుచ్చుకోవడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఓ వైపు వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెబుతూనే మరో వైపు అదే వృత్తి విద్యను నేర్పే ఐటీఐలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు ఎలాంటి నిధులు రాకపోవడంతో ఐటీఐ ప్రాంగణాల నిర్వహణ పూర్తిగా డీలా పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ఏ మాత్రం పట్టింపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు: 7 లో..



సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నారాయణపురం రైతులు

సచివాలయం ఎదుట నారాయణపురం రైతుల నిరసన

- 'అడవి' పట్టాలను రైతుల పేరుతో జారీ చేయాలని డిమాండ్
- రాజధానిలో నిరసనతో చర్చనీయాశంగా మారిన సమస్య



కేసముద్రం, జూలై 1 : కేసముద్రం మండలం నారా యణపురం గ్రామానికి చెందిన రైతులు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పట్టాపాస్ పుస్తకాల కోసం తిరుగుతూ విసిగి వేసారి ఏకంగా రైతులు సచివాల యానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. సచివాలయం వద్ద ఫ్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. వందల మంది పోలీసులు రైతులను సచివాలయం లోపలికి వెళ్లనీయకుండా గేటు వద్దనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ఎంపీటీసీ ధరావత్ రవి మాట్లా డుతూ గ్రామంలో 1827 ఎకరాల్లో 60 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను 2017లో భూప్రక్షాళనలో అటవీ భూమిగా పేర్కొనడంతో రైతుల పట్టాదారు పాస్‌పుస్తకా లన్నీ రద్దయినట్లు తెలిపారు. ఈ భూమిని తిరిగి రెవె న్యూ పరిధిలోకి మార్చి 700 ఎకరాల్లో రైతులకు పట్టాదా రు పాస్‌పుస్తకాలు జారీ అయినట్లు తెలిపారు. మిగిలిన భూములను 2022లో ధరణిలో రైతు పేరు 'అడవి', తండ్రి పేరు 'అడవి'గా నమోదు చేసి, సవరణలో దరఖా స్తు చేసుకోవాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. సవరణలో కోసం పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ రైతుపేరు ధరణిలో మాత్రం మారడంలేదని అన్నారు. 1100 ఎకరాల్లో సుమారు 800 మంది రైతులు పట్టా పాస్‌పుస్తకాలు రావాల్సిఉందని తెలిపారు. గత ఏడేళ్లుగా పట్టాదారుపాస్‌పుస్తకాలు లేక రైతుబంధు, రైతుబీమా, ఇతర ప్రభుత్వ పథకాలు అమలు కాకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఏడేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా మా గ్రామ పట్టాదారు పాస్‌పుస్తకాల సమస్య తీరకపోవడంతో సచివాలయానికి వచ్చి సీఎంకు తమ గోడు వినిపించుకునేందుకు వచ్చామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నారాయణపురం గ్రామ రైతులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సాయంత్రం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో రైతులను మాట్లాడిస్తామని హామీ పోలీస్ అధికారులు ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నిరసనలో గ్రామానికి చెందిన సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ , జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 161 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో అధికంగా వ్యవసాయశాఖ, జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమ శాఖలకు చెందినదరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఒకవేళ పరిష్కారానికి వీలు లేని దరఖాస్తులు ఉంటే సంబంధిత దరఖాస్తుదారులకు వివరించాలని సూచించారు.ఏ శాఖలోనూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెకర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జడ్పీ సీఈవో నర్మద తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పట్టా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు..

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన దివ్యాంగుడు చంద్రయ్య



మహబూబాబాద్ టౌన్ : జిల్లాలోని ఇనుగుర్తి మండల కేంద్రం శివార్లలో తన పట్టాభూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని అదే గ్రామానికి దివ్యాంగుడు ఇస్సంపల్లి చంద్రయ్య ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ సర్వేనంబరు 292లో తనకు మూడెకరాల పట్టా భూమి ఉందని, దానిని కబ్జాచేసేందుకు అదే గ్రామానికి చెందిన ఇరువురు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో పూర్తి ఆధారాలతో కూడ గ్రీవెన్స్‌లో పిర్యాదు చేశామని వివరించారు. అధికారులు స్పందించి కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

కోడి చెరువు ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలి

గూడురు : కోడి చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురికాకుండా ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేయించాలని ఆయకట్టు రైతులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. సంబంధిత చెరువు కింద గూడూరు, బ్రహ్మణపల్లి, ఏపూరు, మచ్చర్ల గ్రామాలలో 350 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఈ చెరువు నీటితో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. శిఖం భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు రైతులు జున్నూరి వెంకన్న, నూకల ఉపేందర్, సమ్మెట శ్రీనివాస్, నూకల సురేందర్, రాజన్న, బీక్య, రాసాల యాకయ్య, ఎల్లయ్య, మహేందర్, వెంకన్న, సోమయ్య, శ్రీశైలం, గిరిశెట్టి యాకయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

గూడూరు, జూలై 1 : గూడూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ)ని సోమవారం సాయంత్రం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తనిఖీ చేశారు. అస్పత్రిలోని పలు వార్డులను తిరిగి సమస్యలను వైద్యుడు శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. తొలుత సీతానగరం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ఉండే గదులను పరిశీలించారు. కిటికిలకు మెస్‌డోర్‌లు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం గంగు నాయక్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో చంద్రమోహనస్వామి ఉన్నారు.



గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు ఘన సన్మానం



ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ రాష్ట్ర బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 1 : డాక్టర్స్ డేను పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మానుకోట శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో డాక్టర్స్‌డే సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ వైద్యసేవలందించిన వైద్యులను సన్మానించారు. అందులో భాగంగా స్థానిక శాసనభ్యులు మురళీనాయక్ స్వయంగా వైద్యులు కావడంతో ఆయన్ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యసేవలో ఎంతో మంది ప్రాణాలు కాపాడి ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి చట్టసభలో అడుగుపెట్టి తిరుగులేని నాయకుడిగా ఎదిగారని ఐఎంఏ బాధ్యులు కొనియడారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఫత్తేపురంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్, జూలై 1 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని ఫత్తేపురం, పోలేపల్లి గ్రామాల్లో సోమవారం వనమహోత్సవం, మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల సమస్యల పై వినతులు, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల వద్దకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి పరిశీలించి వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన అందజేసి స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామాల్లో ఎక్కువగా పెన్షన్, భూసమస్యలు, రహదారి సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామన్నారు. ఫత్తేపురంలో అనేక సంవత్సరాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్న రహదారి వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలించి తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పోలేపల్లిలో చెరువు తూము, కట్ట వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకొని కావల్సిన నిధులు మంజూరీ చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా స్వయంగా తన దృష్టికి తీసుకువస్తే అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ప్రజలు ధైర్యంగా ఉండాలన్నాని భరోసానిచ్చారు. అనంతరం ఫత్తేపురం పాఠశాలను, అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి పిల్లలకు బిస్కట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇట్టి శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, డీటీ నర్సయ్య, ఎంపీవో గౌస్, పీఆర్ ఏఈ సురేష్, నోడల్ ఆఫీసర్ బుచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, హమ్యానాయక్, యూత్ అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, లింగాల వెంకటనారా యణగౌడ్, సోమన్న, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బిల్లులొస్తాయో.. లేదోనని మనోవేదన?

గుండెపోటుతో మాజీ సర్పంచ్ భర్త మృతి



అజ్మీర కృష్ణ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : తన భార్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల కోసం పెట్టిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో మనోవేదనకు గురై అస్వస్థతకు గురైన మాజీ సర్పంచ్ భర్త సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ మండలం తూర్పు తండాలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి మృతుడి కు టుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుతండాకు చెందిన అజ్మీర కృష్ణ (38) గత సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య సరితను బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా పోటీచేయించగా.. ఆమె విజయం సాధించారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీ అభివృ ద్ధి పనుల కోసం కృష్ణ బయట అప్పులు చేసి ఖర్చు చేశారు. కానీ ఆ పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడం, ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం కూడా ముగియడంతో పెండింగ్‌లో ఉన్న బిల్లులు తమకు వస్తాయో.. లేదో నని కృష్ణ, సరిత దంపతులు కొంతకాలంగా మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన కృష్ణను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మానుకోట లయన్స్ క్లబ్‌కు ఐదు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మానుకోట లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాధవపెద్ది వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 1: లయన్స్‌క్లబ్ మానుకోట శాఖకు ఐదు ఉత్తమ అవార్డులు లభించాయి. 2023-24 సంవత్సరంలో ఉత్తమ సేవలందించినందుకు గాను మానుకోట లయన్స్ ఐదు అవార్డులు దక్కించుకుంది. ఫస్ట్ బెస్ట్ పర్మినెంట్ ప్రాజెక్టులు, ఫస్ట్ బెస్ట్ ఐ బాల్ కలెక్షన్, ఫస్ట్ బెస్ట్ ఫార్మర్స్ అవేర్నేస్, కమిటెడ్ ప్రెసిడెంట్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, సెకండ్ బెస్ట్ స్కూల్‌బ్యాగ్స్ డిస్ట్రిబ్యూషన్‌కు అవార్డులు లభించాయి. వరంగల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన అవార్డ్‌నైట్ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ 320-ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా లయన్స్‌క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు మాధవపెద్ది వెంకట్‌రెడ్డి అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ బాధ్యులు పీవీ.ప్రసాద్, అనుమాల వెంకటేశ్వర్లు, యాళ్ల మురళీధర్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారం, సమష్టి కృషితో ఐదు అవార్డులు దక్కించుకున్నామని వెంకట్‌రెడ్డి తెలిపారు.

జిల్లాలో 873 మంది ఎస్జీటీలు బదిలీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 1 : మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు 873 మంది సోమవారం బదిలీపై వెళ్లి తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారు. ఇటీవల తెలంగాణ విద్యాశాఖ చేపట్టిన బదిలీల్లో భాగంగా ఒకే పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు విధులు నిర్వహించిన ఉపా ధ్యాయులు తప్పని సరిగా మరో చోటికి బదిలీపై వెళ్లాల్సి ఉంది. అందులో భాగంగానే 8 సంవత్సరాలు పూర్తి అయిన ఉపాధ్యాయు లతో పాటు కనీసం రెండు సంవత్సరాలు పూర్తయిన ఉపాధ్యాయులు కూడా మరో పాఠశాలకు బదిలీపై వెళ్లేందుకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోగా వారు కూడా ఇతర మండ లాలకు బదిలీపై వెళ్లారు.

సందడిగా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లా వ్యాప్తంగా 240 బాలబాలికల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 1 : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌పై అండర్ 8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల కేంద్రాల నుంచి 240 బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 15 మంది బాల బాలికల ను ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని గోపీచంద్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, శ్రీలత, శ్రీనాథ్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు

గడ్డం సమ్మయ్యకు అభినందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవరుప్పుల, జూలై 1: అర్హులైన చిందు కళాకారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు స్వగ్రామంలో అభినందన సభ జరుగగా శ్రీహరితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మయ్య తాతల కాలం నుంచి చిందు వృత్తితోనే జీవనం సాగించేవారని, సమ్మయ్య కూడా అదే వృత్తిని కొనసాగిస్తూ కళలను పదిమందికి ఉపయోగపడే విధంగా కృషి చేశారని అన్నారు. ఆయన కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చారని గుర్తు చేశారు.

చిందు కళాకారులతో పాటు మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ అవార్డు పొందడం పాలకుర్తికే గర్వకారణమన్నారు. సమ్మయ్య కుటుంబంతో పాటు చిందు కళాకారులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గడ్డలో సమ్మయ్య జన్మించడం, చిందు కళలకు ఆజ్యం పోయడం, పద్మశ్రీ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ పొందడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరుపున సమ్మయ్యతో పాటు చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మయ్యను పూలమాలలు, షాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం మోహన్‌రావు, వంశీధర్‌రెడ్డి, శివకుమార్, రాంబాబు, నల్ల శ్రీరామ్, పులిగిళ్ల సుధాకర్, కందగట్ల సత్తయ్య, గడ్డం వెంకన్న, ఒగ్గు రవి, అందె భాస్కర్, రాజ్‌కుమార్‌నాయక్, గుర్రం సీతారామ్, లక్ష్మీనారాయణ నాయక్, మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

సీపీఆర్‌పై పోస్టల్ కవర్ విడుదల

డాక్టర్ రామక శ్రీనివాస్ కృషితో రూపకల్పన



డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని చారిత్రాత్మకమైన పోస్టాఫీసులో సీపీఆర్ ప్రక్రియ పోస్టల్ కవర్‌ను హైదరాబాద్ జోన్ పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత విడుదల చేశారు. అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన అత్యవసర సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న హనుమకొండకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రామక శ్రీనివాస్ తపాలశాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్‌ను తయారు చేయించారు. సీపీఆర్‌పై తగిన ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోస్టల్ కవర్‌ను తపాలా శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ చాలా కాలంగా సీపీఆర్ పట్ల అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ జీవన్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆయన పొందిన పురస్కారాలను, సేవాభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయుడు సీహెచ్ ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి భరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (రిటర్డ్) వి. రామచంద్రారెడ్డి ఇతర పోస్టాసు సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచి రాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు సోమవారం తెలిపారు. డీబారైన వారిలో సికింద్రాబాద్ యూనివర్సిటీ పీజీ కళాశాల ఓయూలో ఇద్దరూ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



అక్షయ్‌రామ్ వర్ష

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదన నగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ప్రేరణ శిక్షణకు పంథిని జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గండి వర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, జూలై1: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలతో వచ్చిన గిరిజనుల వద్ద నుంచి పీవో చిత్రా మిశ్రా వినతులు స్వీకరించారు. మొత్తం 66 మంది గిరిజనుల తమ సమస్యల ను పీవోకు విన్నవించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్ కేటాయించాలని కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన చింత రుషి వినతి పత్రం అందించారు. సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మి భాగ్య కోరారు. అనారోగ్యా కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం మండలానికి చెందిన వర్షిణి విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఓఎంగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయికి చెందిన దుగ్గిరాల శ్రీలేఖ వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 141, 142లోని భూమికి పట్టాలివ్వాలని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన తాటి నీలాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర స్వామి, ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూలై 1 : ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా మధుసూదన్ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వి. మోహన్‌రావు జూన్ 30 న పదవి విరమణ పొందడంతో హెచ్‌ఆర్‌డి సీజీయంగా విధులు నిర్వర్తిస్తున్న టి. మధుసూదన్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట, జూలై 1 - బల్లార్షా సెక్షన్‌లో మూడో లైన్‌ల నిర్మాణపనుల కారణంగా ఈ నెల 3 నుంచి పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్, బల్లార్షా మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. గోరఖ్‌పూర్ - యశ్వంతాపూర్‌ల మధ్య నడిచే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ మక్తల్, నిజామాబాద్‌ల మీదుగా, దారి మళ్లించినడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు



వరంగల్ ఐటీఐలో అధ్వానంగా విద్యార్థుల టాయిలెట్లు

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో మూడు, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారంలో మరో మూడు నడుస్తున్నాయి. జనగామ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ లేదు. ఏటూరునా గరం ఐటీఐ ప్రధానంగా స్థానికంగా ఉన్న ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసింది. ఈ ఐటీఐల్లో ప్రవేశాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు 21 వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలపై మొత్తం అజమాయిషీ ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రేనింగ్ (డేట్) అనే సంస్థదే. ఐటీఐల్లో ఇచ్చే పారిశ్రామిక శిక్షణకు సంబంధించిన సిలబస్‌ను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఈ సంస్థ రూపొందించిన ట్రెయినింగ్ మ్యాన్యువల్‌నే వీటిలో అమలు చేస్తారు. కాగా ప్రభుత్వ ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సామగ్రిని సమకూర్చాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమే. ప్రభుత్వ ఐటీఐల్లో పది రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రైవేటు ఐటీలు మాత్రం కేవలం ఒకటీ, రెండు ట్రేడ్‌లనే నిర్వహిస్తున్నాయి. వాటిలో ఎలక్ట్రీషియన్ తప్పని సరి. ఈ ఐటీలలో ఒక సంవత్సరం కోర్సు, రెండు సంవత్సరాల కోర్సులున్నాయి. ఎలక్ట్రీషియన్ రెండు సంవత్సరాల కోర్సు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఏడాది కోర్సు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీల్లో ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

అందని రా మెటీరియల్ డబ్బులు.. పాతయంత్రాలతోనే కుస్తీ..

ఐటీఐల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో పొందుతున్న శిక్షణకు గాను రా మెటీరియల్‌పైనే ప్రతీ నెల రూ.400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయాలి. ఒక సంవత్సరం కోర్సు చదివే విద్యార్థికైతే సంవత్సరానికి రూ.4800, రెండు సంవత్సరాల కోర్సు విద్యార్థికి రూ.9600 ఖర్చు చేయాలి. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. కానీ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేవలం ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు మాత్రమే వస్తున్నాయి. చాలా ఐటీఐల్లో పాత యంత్రాలే ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో కొత్త యంత్రాలను కొనే పరిస్థితి లేదు. ఈ పాత యంత్రాలతోనే విద్యార్థులు కుస్తీ పడుతున్నారు. వీటిపైనే ప్రయోగాలు చేస్తున్నారు. రా మెటీరియల్ రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత మెటీరియల్స్‌తోనే మళ్లీమళ్లీ చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక ఫిట్టర్ విద్యార్థి ఇనుము మెటీరియల్ సరఫరా లేక గత విద్యార్థులు చేసిన ఇనుప ముక్కలతోనే మళ్లీ చేస్తున్నారు. అలాగే ఎలక్ట్రీషియన్ విద్యార్థి విద్యుత్ వైర్ల సరఫరా లేక పాత వైర్లతోనే సర్దుకోవలసి వస్తోంది. వెల్డింగ్ ట్రేడ్ విద్యార్థులు ఏడాదిలో 50 ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ లేక పది, పదిహేను ప్రాక్టికల్స్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. ఐటీఐల నిర్వహణ ఖర్చులను కూడా రాష్ట ప్రభుత్వం ఇవ్వడం లేదు. సరిగా బడ్జెట్ రాకపోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లించడం కూడా ఐటీఐలకు కష్టంగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత పదేళ్ల కాలంలో అనేక మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగేలేదు. కేవలం 40శాతం సిబ్బందితోనే ఐటీఐలు నడుస్తున్నాయి.



వరంగల్ ఐటీఐలో డ్రాఫ్ట్సుమెన్ తరగతుల భవనం దుస్థితిదీ..

- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు

ఇటీవల వీఆర్‌వోలు, వీఆర్‌వోలను జూనియర్ అసిస్టెంట్లుగా ఐటీఐలలో నియమించినా పెద్దగా ప్రయోజనం లేకుం డా పోయింది. వారికి వృత్తి శిక్షణకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. గ్రామాల్లో మస్కూరు పని చేసే వీరికి సాంకేతికపరమైన వృత్తిశిక్షణపైగానీ, కనీసం ఆఫీసులో రికార్డుల నిర్వహణలోగానీ అవగాహన లేకపోవడం వల్ల వారు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. ఒక్కో ఐటీఐకి ఇద్దరు, ముగ్గురిని నియ మించడంతో ఐటీఐల్లో సిబ్బంది ఉన్నట్టుపైకి కనిపిస్తు న్నది కానీ క్షేత్ర స్థాయిలో అంతాలోటే. ఇక ఐటీఐల్లో వృత్తిశిక్షణలో కీలకమైన టెక్నికల్ స్టాఫ్ మరీ తక్కువ గా ఉన్నారు. అన్ని ఐటీఐలలో 60 శాతానికిపైగా ఖాళీ లున్నాయి. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎప్పుడో పన్నెండేళ్ల క్రితం ఏపీపీ ఎస్సీ ద్వారా జరిగిన నియామకాలే తప్ప ఆ తర్వాత కాలంలో ఖాళీల భర్తీయే జరగలేదు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగలేదు. ఇటీవలే కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రం రెగ్యులరైజ్ చేశారు. ఇదొక్కటే ఐటీఐలో జరిగిన చెప్పుకోదగిన పరిణామం. ఐటీఐలో ఒక్కో యూనిట్ (ట్రేడ్)లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఎన్ని ట్రేడ్‌లు ఉంటే 20 మంది చొప్పున అంత మంది విద్యార్థులను తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్రేడ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ తప్పని సరిగా ఉండాలి. కానీ ఇన్‌స్ట్రక్టర్ల కొరత వల్ల ఉన్న వాళ్లే ఒక్కొక్కరు రెండు, మూడు ట్రేడ్లను చూసుకోవాల్సి వస్తోంది.

కానరాని కనీస సౌకర్యాలు

ప్రభుత్వ ఐటీఐల్లో కనీస సౌకర్యాలు భూతద్దం వేసి చూసినా కానరావు. ఐటీఐలకు ప్రస్తుతం ఉన్న భవనాలు 70, 80 ఏళ్లనాటివి. అవి పూర్తిగా పాతపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలోని భవనాలు, వర్క్‌షెడ్లు పూర్తిగా పాతపడిపోయి కనిపిస్తాయి. మూత్ర, శాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. తాగునీటి సదుపాయం అసలు లేదు. అరకొర వసతుల మధ్య వృత్తిశిక్షణ పొందుతున్న విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. మహబూబాబాద్ ఐటీఐ భవనం పూర్తిగా పాతపడడంతో దాని స్థానం కొత్త భవనం నిర్మించగా జిల్లా పోలీసు అధికారులు లాక్కొని అందులో ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చేసేది లేక ఐటీఐను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భూపాలపల్లిలో ఐటీఐ కోసం కట్టిన కొత్త భవనంలో తొలుత కలెక్టరేట్ ఏర్పాటు చేయగా కలెక్టరేట్ భవనం పూర్తికావడంతో ఇటీవలే దానిని ఐటీఐకి తిరిగి అప్పగించారు.

జనగామలో ఎప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లోని అయిదు జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా జనగామ జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఈ జిల్లాకు ప్రభుత్వ ఐటీఐ ఇది వరకే మంజూరైంది. ఐటీఐ భవన నిర్మాణానికి సిద్ధిపేట రోడ్డులోని గుట్టల సమీపంలో స్థలాన్ని కూడా కేటాయించారు. సర్వే కూడా పూర్తయింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురాకపోవడంతో జనగామలో ఐటీఐ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీనితో విద్యార్థులు ప్రైవేటు ఐటీఐలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేటు ఐటీఐలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయాలను గుంజుతున్నాయి.

ఒకే క్యాంపస్‌లో..

ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్ విశాలంగా ఉంటుంది. 70 ఏళ్ల క్రితం ఈ ఐటీఐ ఏర్పాటైంది. దీనికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ ఐటీఐకి విశాలమైన స్థలం ఉండటంతో.. ఇదే అవకాశంగా అన్ని కార్యాలయాలను ఇందులోనే ఏర్పాటు చేశారు. హనుమకొండ ఐటీఐని కూడా ఇందులోకే మార్చారు. ఇది వరకు ఇది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అద్దె భవనంలో నడిచేది. దానిని ఈ ములుగు రోడ్డులోని ఐటీకి క్యాంపస్‌కు తరలించారు. ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఇది చాలదన్నట్టు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును, దీంతో పాటు రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును సైతం ఇందులోనే చోటిచ్చారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ములుగు రోడ్డులోని ఐటీఐ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతమైంది. విచిత్రమేమిటంటే ప్రస్తుతం పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మాణంలో ఉన్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బహుళ అంతస్తుల భవన స్థలంలో కొంత ఇందులోనే చూపారు.

ఏటీసీలు సరే.. ఐటీఐల్లోని సమస్యల సంగతేంటి?

ప్రభుత్వ ఐటీఐలు అనేక సమస్యల మధ్య కొట్టు మిట్టాడుతున్న నేపథ్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంలో వీటిల్లో అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటీసీలు ఐటీఐలో ఒక భాగంగానే నడుస్తాయి కానీ ప్రస్తుతం ఉన్న పాత ఐటీఐ పరిస్థితేంటన్నది ప్రశ్న. ఏటీసీలు మాత్రమే టీటీఎల్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఐటీఐలు మాత్రం యథావిధిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయి. ఏటీసీలు ఏర్పాటయితే ప్రస్తుతం ఐటీఐల్లో నిర్వహిస్తున్న ట్రేడ్ల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డిజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్టుమెన్ సివిల్, టర్నర్, మెషినిస్టు, కోపా ట్రేడ్లను నిర్వహిస్తున్నారు. వీటి కొనసాగింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఐటీఐ ఆవరణలో ఏటీసీల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతుంది. కానీ ఐటీఐ ప్రస్తుత పాత భవనాల సంగతేమిటీ? విద్యార్థులకు రామెటీరియల్ డబ్బులు ఇచ్చేది ఎవరు? సిబ్బంది ఖాళీల భర్తీ జరిగేనా? మౌలిక వసతుల కల్పన మాటేమిటీ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో పాటు సమాంతరంగా ఐటీఐలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఏటీసీల ఏర్పాటుతో ఒరిగే ప్రయోజనం పెద్దగా ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం




ఘన్‌పూర్ మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. పెరిగిన ధరలు ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. ఏ పంట ధర ఎంత పెరిగింది? మార్కెట్ యార్డులో ఏ సరుకుకు ట్రేడర్లు ఎంత ధర ఇస్తున్నారు? అనేది ఈ ధరలతో రైతులు పోల్చుకుంటే నష్టపోకుండా ఉండవచ్చు. ఒక్కోసారి కొన్ని పంటలకు మద్దతు ధరల కంటే డిమాండ్‌ను బట్టి ఎక్కువ ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలపై రైతులకు అవగాహన ఉంటే లాభపడే అవకాశం ఉంటుంది. ఐతే గత ఏడాది ధరలతో ఈ ఏడాది పెంచిన ధరలను.. పెరిగి పోతున్న పెట్టుబడి వ్యయంతో పోల్చి చూసుకుంటే పెద్దగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఎంతైనా గుడ్డిలో మెల్లలా కొంత మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు, కలుపు తీయడం, పంట కోత కోయించడం, తూర్పార పట్టించడం, మార్కెట్ యార్డుకు రవాణా చేయడం అన్నీ లెక్కలు వేసి చూసుకుంటే చివరకు ఏం మిగలడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతుకు లాభం మాటేమోగాని కూలీ గిట్టుబాటు కాని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి, చేసిన అప్పులకు పోగా రోజుకు వంద, రెండు వందలు కూడా రైతుకు కూలి పడడం లేదని వాపోతున్నారు.

పంట పెట్టుబడి ఇలా..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు వాటిని పండించడానికి పెడుతున్న పెట్టుబడి, వస్తున్న ఆదాయం లెక్క వేసి చూస్తే పెద్దగా ఫలితం ఉండడం లేదని తెలుస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు వస్తున్న ఆదాయం ఏ మాత్రం చెప్పుకోదగినదిగా ఉండడం లేదంటున్నారు. వరి పంటకు ఎకరాకు పెట్టుబడి 20 నుంచి 25 వేల రూపాయల వరకు అవుతోందని, ట్రాక్టర్‌తో దున్నడానికి రూ.5 వేలు, విత్తనాలు వేయడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.3 వేలు, ఎరువులు, పురుగు మందులకు 3 వేలు, కోత కోయడానికి రూ.5 వేలు, రవాణ తదితర ఖర్చులు కలుపుకుని తడిసి మోపెడు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ధాన్యం లేదా 20 నుంచి 22 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, ధాన్యం ధర క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2300 వేసుకున్నా 46 వేల నుంచి 50 వేల రూపాయలు వస్తున్నాయి. పెట్టుబడి పోను ఆరు నెలలు కష్టపడితే రూ. 20 వేల నుంచి 25 వేలు మాత్రమే మిగులుతున్నాయని చెబుతున్నారు. అంటే నెలకు రూ.3 వేల నుంచి 4 వేలు మాత్రమే మిగిలినట్టు. ఇంత తక్కువ మిగిలితే రోజు కూలి ఏం పడినట్టని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి వెళితే రోజుకు రూ.200ల నుంచి రూ.300లు కూలి వస్తున్నదని చెబుతున్నారు.



పెరిగింది గోరంతే...

తోట రమేశ్, రైతు, శివునిపల్లి

నాలుగేళ్ల క్రితం మద్దతు ధరలు కొంత మెరుగ్గానే పెరిగాయి. ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈసారి పెరుగుదల అంతంతే ఉంది. ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేసిన కష్టం, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులు అన్ని చూసుకుంటే లాభం మాటేమోగాని రైతులే మిగిలేలా ఉంది.

పెరిగిన మద్దతు ధరల వివరాలు

వరి సాధారణ రకం క్వింటాల్‌కు గత ఏడాది రూ. 2183 కాగా ఈ ఏడాది రూ.2300కి పెరిగింది. అంటే క్వింటాల్‌కు రూ. 117 పెరుగుదల ఉంది.

పంట	2024	2023	పెరుగుదల
వరి (సాధారణ)	2300	2183	117
వరి (ఏ గ్రేడ్)	2320	2203	117
పెసలు	8682	8558	124
మినుములు	7400	7050	450
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
వేరుశనగ	6783	6377	406
పత్తి(పొట్టిపింజ)	7121	6620	501
పత్తి(పొడుగుపింజ)	7521	7020	501
పొద్దు తిరుగుడు	7280	6760	520
సోయాబీన్(పసుపు)	4892	4600	292
నువ్వులు	9267	8635	632
జొన్నలు(హైబ్రీడ్)	3371	3180	191
జొన్నలు(మల్దండి)	3421	3225	196
సజ్జలు	2625	2500	125
రాగులు	290	3846	444

వరికి కనీసం రూ.500లు పెంచాలి



సముద్రాల రాజు, రైతు, నమిలిగొండ

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.500లు, పత్తికి రూ.1000లు పెంచితే రైతులకు కొంత లాభదాయకం. అలా కాకుండా ధాన్యానికి రూ.117, పత్తికి రూ. 501లు పెంచడం ప్రస్తుత పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. రైతుకు కనీసం కూలి రేటు కూడా పడకపోతే ఇక ఏం ఫలితం ఉంటుంది?

ఎద్దు పొడిచి గిరిజన రైతు మృతి



మృతి చెందిన రైతు బానోత్ శ్రీను

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : ఎద్దు పొడవడంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎస్) శివారు బిచ్యాతండాలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్యాతండాకు చెందిన బానోత్ శ్రీను (47) రెండు ఎడ్లు ఉన్నాయి. వర్షం వస్తుండడంతో ఆరు బయట ఉన్న పశువులను కొట్టంలో కట్టేసేందుకు వాటిని తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా శ్రీనును పొడవడంతో అతని తల ఇంటిగోడకు బలంగా తాకింది. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నానుకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య నానుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 1: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం (సరస్వతీ) బ్యారేజీ వద్ద నిపుణుల బృందం చేపడుతున్న పరీక్షలు 11 రోజులక చేరాయి. ప్యార్లర్ సెర్చింగ్ మెథడ్‌లో ఈ టెస్టులు జరుగుతున్నాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా సోమవారం నాటికి ఏడు ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు.

ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లకు దరఖాస్తు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్. విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్ సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూ క్యాంపస్, జూలై 1 : జూలై 2, 4 తేదీల్లో జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను డివిజన్ కౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షల కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికా రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2న జరుగాల్సిన పరీక్ష జూలై 20న, జూలై 4న జరుగాల్సిన పరీక్ష జూలై 22న జరుగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం, పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మార్పులు ఉండవని పేర్కొన్నారు.

6 నుంచి ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్స్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ సీబీసీఎస్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూలై 6 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఎడ్యుకేషన్ విభాగం, హనుమకొండ వాగ్దేవి పీజీ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒకే ఈతలో ఏడు మేకల పిల్లలు



ఏడు పిల్లలకు జన్మనిచ్చిన మేక

మరిపెడ రూరల్, జూలై 1 : సహజంగా మేకలు, గొర్రెలు ఒకే ఈతలో 1, 2, లేదంటే మూడు పిల్లలు జన్మించడం సాధారణంగా చూస్తాం.. కానీ ఈ మేక గతంలో 3 పిల్లలకు జన్మనివ్వగా ఈ సారి ఏకంగా ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు రేఖ వెంకన్నకు చెందిన మేక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు, మూడు కొదమలు ఉన్నట్లు రైతు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన 'యంగ్‌వన్' చైర్మన్



హెలిప్యాడ్ వద్ద టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న చైర్మన్ కిహాక్‌సంగ్

గీసుగొండ, జూలై 1: గీసుగొండ మండలం శాయంపేటహవేలి గ్రామశివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దక్షిణకొరియా దేశానికి చెందిన యంగ్‌వన్ కంపెనీ చైర్మన్, సీఈవో కిహాక్‌సంగ్, కంపెనీ ప్రెసిడెంట్ మిన్‌సుక్‌లీ, డైరెక్టర్ ఎండీ షాజాహాన్ సోమవారం సందర్శించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఉన్న నేపథ్యంలో వారు తొలుత టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుని తమ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుక వచ్చారని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పార్కుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్థలం మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు 3 గంటల పాటు వారు కంపెనీ నిర్మాణాలపై చర్చించారు. యంగ్‌వన్ కంపెనీకి పార్కులో వస్త్ర పరిశ్రమలను నెలకొల్పేందుకు 297 ఎకరాలను టీజీఐఐసీ కేటాయించగా రూ.980 కోట్ల అంచనా వ్యయంతో కొద్దినెలల క్రితం కంపెనీ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో 12వేల మందికి ప్రత్యక్షంగా, మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని టీజీఐఐసీ అధికారులు చెబుతున్నారు. వస్త్ర పరిశ్రమల రంగంలో యంగ్‌వన్ కంపెనీకి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫామ్ టూ ఫ్యాషన్ ఫారిన్ అనే విధంగా ఇందులో వస్త్రాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధుల వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

బాల్యంపై.. బ్యాగు భారం!



వర్ధన్నపేట రూరల్, జూలై 1 : పుస్తకాల బరువు బాల్యాన్ని కుంగదీస్తోంది. కిలోలకు కిలోల బరువుంటున్న పుస్తకాల బ్యాగులతో చిన్నారుల వెన్నెముక వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా.. అని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులే 20 నుంచి 25కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చెబుతున్న విద్యాహక్కు చట్టం.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ, ఈ నిబంధనలేవీ అమలవడం లేదు. అవసరం లేని పుస్తకాలను పాఠశాలలలోనే భద్రపరుచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్నా చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలతో ప్రస్తుతం విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. దీని వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వరంగల్ జిల్లాలో 244 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 70,520 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం పలు పబ్లికేషన్స్ రూపొందించిన, తమ సంస్థల పేరిట ముద్రించిన పుస్తకాలను కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థికి 6 నుంచి 10 పాఠ్య పుస్తకాలు, క్లాస్ వర్క్, హోమ్‌వర్క్ కోసమంటూ పదుల సంఖ్యలో నోట్ పుస్తకాలు ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడవడంతో బ్యాగు బరువు 4 నుంచి 6 కిలోల వరకు అవుతోంది. ఇలా తరగతి పెరిగే కొద్దీ బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్‌బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పుస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- పుస్తకాల మోతతో విద్యార్థుల అవస్థలు
- ఏటేటా పెరుగుతున్న బరువు
- చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు

ఈసారైనా అవగాహన కల్పించేనా..?

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికా రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగా ణ ప్రభుత్వం అదే స్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా.. లేదా చూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రైవేటు యాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవా లి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరు ను వివరించేటప్పుడు, విద్యా హక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తుచేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నెముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు. వెన్నుముక, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంద ని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అమలుకు నోచుకోని చట్టాలు..

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించా లని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవ డం లేదు. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14కిలోలు ఉన్నాడనుకుంటే ఆవిద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టక ష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థుల్లో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులతో అన్ని అంతస్థులు ఎక్కాల్సిందే.

వెన్నుముకపై భారం పడుతుంది



డాక్టర్ సోమశేఖర్, ఎండీ సర్జన్

చిన్న వయసులోనే విద్యార్థులు అధిక పుస్తకాలు గల బ్యాగులు మోయడంతో బరువు నేరుగా వెన్నెముకపై పడుతుంది. ఎంతో సున్నితమైన ప్రదేశంలో మనకు తెలియకుండా రోజు రోజుకు భారం పెరగడంతో ఒక్కసారిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బోధన విధానం, చదువుకునే తీరు కూడా సమయాన్ని బట్టి అనుసరించాలి. ఆడుకునే సమయంలో ఆడుకోకుండా చదవడమే చేస్తే మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

పిల్లలపై ఒత్తిడి తగ్గించాలి



గాండ్ల కుమార్, వర్ధన్నపేట

పిల్లలపై పుస్తకాల బరువుతో పాటు మానసికంగా కూడా పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. చిన్న వయసులో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు పేజీల కొద్ది పుస్తకాలు తిరగేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలపై ఎల్లప్పుడు నిఘా పెంచితే వారి ఆగడాలను అరికట్టవచ్చు.

జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం ప్రారంభం

ఫత్తేపురంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం (హరితహారం) కార్యక్రమాన్ని సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. తొర్రూరు మండలం ఫత్తేపురంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగస్వాములై ఇంటిలో మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలు నాటి సంరక్షించడంతో అడవుల శాతం పెరుగుతుందని చెప్పారు. వివిధ మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచు లు మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు.

వివిధ మండలాల్లో...

మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండాలో ఎంపీవో హరిప్రసాద్, ఏపీఎం రమేష్‌రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు.

● తొర్రూరు మండలం ఫత్తేపురంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగస్వాములై ఇంటిలో మొక్కలు నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్న అంజయ్య జడ్పీటీసీ మంగళంపల్లి



తొర్రూరు మండలం ఫత్తేపురం పాఠశాలలో మొక్కలు నాటుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, డీటీ నర్సయ్య, ఎంపీవో గౌస్, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

● పెద్దవంగర మండలంలోని చిన్నవంగరలో ఎంపీపీ ఎర్ర సబిత, జడ్పీటీసీ శ్రీరాంజ్యోతిర్మయి, ఎంపీడీవో వేణుమాధవ్, ఎంపీవో సత్యనారాయణ, ఎస్‌వో స్రవంతి, యాకయ్య, శేఖర్, వెంకటయ్యలు మొక్కలు నాటారు.

● గంగారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సువర్ణపాక సరోజన మొక్కను నాటి కార్యక్రమాన్నిప్రారంభించారు. జడ్పీటీసీ ఈసం రమ, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర, ఎంపీడీవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లికుదురు మోడల్ స్కూల్లో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి మొక్కలు నాటి ప్రారంభించారు. ఎంపీడీవో బాలరాజు, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

● గూడూరు బాలికల ఉన్నత పాఠశాల, మర్రిమిట్ట పాఠశాలలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీటీసీ-1 కత్తిస్వామిలు మొక్కలు నాటారు.

● కేసముద్రం మండలం అమీనాపురంలో ఎంపీటీసీ అంబటి లక్ష్మి, సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, ఎస్‌వో రాజు, తాళ్లపూసపల్లిలో ఎస్‌వో కోట కనకయ్య, నరేటి కొమురయ్య మొక్కలు నాటారు.

● డోర్నకల్ మండలం చిల్కోడులో ఎంపీడీవో దారావత్ శ్రీనివాస్, ఎంపీవో మున్వర్‌బేగ్‌లు మొక్కలు నాటారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు.

● కురవి పీహెచ్‌సీలో ఎంపీపీ గుగులోతు పద్మావతి, జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి మొక్కలు నాటారు. వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించి ప్రకృతి పునరుజ్జీవానికి పాటుపడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి, ఎంపీడీవో వీరబాబు, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీవో విజయలక్ష్మి, ఏపీవో యాకాంబ్రం, పీహెచ్‌సీ వైద్యులు విరాజిత, ఈవో దివాకర్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష దేవుళ్లు వైద్యులు



డీఎంహెచ్‌వో కళావతిబాయి, డాక్టర్లను సన్మానిస్తున్న సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూలై 1: ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్యసేవలందించే డాక్టర్లు ప్రజలకు ప్రత్యక్షదేవుళ్లని ఉషోదయవాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలిబిందెల మల్లయ్య అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం వైద్యులు దేవిరెడ్డి, వీరన్న, బాలునాయక్, తిరుపతిరెడ్డి, సూర్యకుమారిలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లయ్య మాట్లాడారు. అసోసియేషన్ బాధ్యులు ఆకుల శంభయ్య, బోనగిరి రవీంద్రగుప్తా, నల్లు సుధాకర్‌రెడ్డి, కల్లెం వెంకట్‌రెడ్డి, దాసరి ప్రసాద్, అశోక్, పమ్మిరాజు, కాపరబోయిన శ్రీనివాస్, పరంధామయ్య పాల్గొన్నారు.

● ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్‌డేలో జిల్లా వైద్యాధికారి బి.కళావతిబాయి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, ప్రోగ్రాం అధికారులు సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, విజయ్, ప్రసాద్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధక్షులు వొబిలిశెట్టి రామకృష్ణ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

● గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంట్ వీరన్న, వైద్యులు భరత్‌రెడ్డి, ఎడ్ల రమేష్‌లను గూడూరు జర్నలిస్టులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర నాయకులు బానోత్ నర్సింహనాయక్, మంగీలాల్ పాల్గొన్నారు.

మైత్రి ఆస్పత్రిలో జాతీయ వైద్య దినోత్సవం



మైత్రి ఆస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న గూడూరు జడ్పీటీసీ గుగులోతు సుచిత్ర

జిల్లా కేంద్రం లోని మైత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో జాతీయ వైద్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ. గుగులోతు బాలు నాయక్, వైద్యులు కె. ప్రదీప్ రెడ్డి, బీఏఎం. ప్రసాద్, చింతారమేష్, బండి మురళీధర్, డి.కుమార్, వి.హేమంత్‌కుమార్‌లను శాలు వాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన గూడూరు జడ్పీటీసీ గుగులోతు సుచిత్ర మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించి వారి గుండెల్లో నిలవాలని సూచించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 1 : అంకితభావంతో విధులు నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడిన ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థుల మన్ననలు పొందుతారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి శంతన్‌రా మరాజు అన్నారు. మహబూబాబాద్‌లోని మహాత్మాజ్యోతిరావుపూలె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గుర్రం అనిత పదోన్నతిపై రంగారెడ్డి జిల్లా మహేశ్వర బాలికల జూనియర్ కళాశాలకు పదోన్నతిపై వెళ్లారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రిన్సిపాల్ అనితను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతనంగా విధుల్లో చేరిన ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయ బృందం అనితా శ్రీనివాస్, రామరాజు, ఈశ్వర్, రాంచందర్, ఉపేందర్, అప్సర్, సలీం, శివ, షాకిరా, శ్రీలత, స్వరూప, మహేష్, రమేష్, స్వప్న, పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 1 :జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఈవో రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని 15 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేకాధికారులు, స్ట్రాంగ్ పీజీ సీఆర్టీలు, సీఆర్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...విద్యాసంవత్సర క్యాలెండర్ ప్లాన్ అమలు, పాఠశాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. వంట పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. జీసీడీవో విజయకుమారి పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగిద్దాం

గార్ల, జూలై 1 : తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడి ప్రాణాలర్పించిన దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు అన్నారు. ఈ నెల 4న ఖమ్మంలో జరిగే దొడ్డి కొమురయ్య 75వ వర్ధంతి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఏఐకేఎంఎస్ మండల ఉపాధ్యక్షులు వాంకుడోతు సక్రు, నాయకులు హరి, లక్ష్మణ్, మాంజి, రవి, మోహన్, బాబులాల్ పాల్గొన్నారు.

విశ్వనాథం మృతి పార్టీకి తీరని లోటు

బయ్యారం, జూలై 1 : గుండెపోటుతో అకాల మరణం పొందిన సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు విశ్వనాధం మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. బయ్యారంలో సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఇరు వర్గాలకు చెందిన నేతలు వేర్వేరుగా విశ్వనాధం చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఐలయ్య, వెంకటేశ్వర్లు, యాకన్న, పద్మ, బిక్షం, రాకేష్, సంగన్న, నాగేశ్వరరావు, బుచ్చయ్య, మురళి, మహేష్, రమేష్, స్వామి పాల్గొన్నారు.

సాగు చేసే భూములకే రైతు బంధు ఇవ్వాలి

కురవి, జూలై 1 : వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములకే, వ్యవసాయం చేస్తున్న రైతులకే రైతుబంధు వర్తింప చేయాలని పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుబంధు పథకంపై సలహాలు, సూచనలు తీసుకునేందుకు కురవి రైతు వేదికలో సోమవారం ఆంధ్రాబ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డీసీవో ఎం.వెంకటేశ్వర్లు రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఏవో మంజుఖాన్, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, ఎండి. గుగులోతు సుధాకర్, మాజీ ఎంపీపీ జి.రాంచంద్రయ్య, మాజీ జడ్పీటీసీ బాదావత్ రామునాయక్, రైతులు మేక దామోదర్‌రెడ్డి, నామ సైదులు, అంబటి వెంకటనారాయణ, గణేష్, మేక వెంకట్‌రెడ్డి, సంజీవనాయక్, ఏఆర్వో ప్రవీన్‌కుమార్, ఏవోలు లయ, రమ్య, రాజేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

కాల్వలకు శాశ్వత మరమ్మతు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజన్న

బయ్యారం, జూలై 1 : కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు కాలువలకు శాశ్వత మరమత్తులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజన్న అన్నారు. బయ్యారంలో సోమవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయ్యారం పెద్ద చెరువు అభివృద్ధి పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రతి సారీ ఖరీఫ్ సాగు సమయంలో తాత్కాలిక మరమత్తులు చేపట్టి చేతులు దులుపుకోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రామారావు

మరిపెడ, జూలై 1 : మరిపెడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా చిన్నగూడూరు ఎంపీడీవో రామారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు విక్రం, లెనిన్, రామోజీ, ఉమేశ్, ప్రణయ్, లాసియా, లావణ్య, వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జూలై 1 : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని సోమవారం పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని అమ్మాపురంతో పాటు మరికొన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అమ్మాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్, మహబూబ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్‌జీటీ టీచర్లను రిలీవ్ చేయాలి

తొర్రూరు, జూలై 1 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామన్న కాంగ్రెస్ సర్కార్ మాట నిలుపుకుని బదిలీ అయిన సెకండ్ గ్రేడ్ టీచర్స్ అందరిని రిలీవ్ చేసి కొత్త పాఠశాలలకు పంపించాలని టీజీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని అన్నారు.

అక్రమ అరెస్టులు ఖండించాలి

తొర్రూరు, జూలై 1 : నిరుద్యోగుల ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగుల ఉద్యమానికి మద్దతుగా వెళ్లిన బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రావు, రాకేష్ రెడ్డిల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వెంటనే నిరుద్యోగ జేఏసీ డిమాండ్లను పరిష్కరించాలని తెలిపారు.

అందరికీ సహాయం చేసే వ్యక్తి నెహ్రూనాయక్

కురవి, జూలై 1 : ఆపదలో ఉన్న అందరికి సహాయం చేసే వ్యక్తి మాలోతు నెహ్రూనాయక్ అని హైకోర్టు జీపీ మంగీలాల్‌నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాలోతు నెహ్రూనాయక్‌కు రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా పదవీ ఇచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనను మంగీలాల్‌నాయక్ సన్మానించారు. నెహ్రూనాయక్ చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించినందున ఆయన పదవీ దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలు ప్రభుత్వానికి..

నర్సింహులపేట, జులై 1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.అభిమాన్యుడు అన్నారు. నర్సింహులపేట రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక జనరల్ బాడీ సమావేశంలో రైతు భరోసా పథకం అమలుపై రైతులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్, వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి, డైరెక్టర్లు రజినీకాంత్‌రెడ్డి, ఉప్పలయ్య, ఏఈవోలు రామకృష్ణ, మౌనిక, కరిష్మా, రైతులు పాల్గొన్నారు.

● మరిపెడ : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ అధికారి అభిమాన్యుడు అన్నారు. సోమవారం మరిపెడ పీఏసీఎస్ భవన్‌లో రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను తెలుసు కోవడానికి స్థానిక వ్యవసాయశాఖ, మరిపెడ ప్రాథమిక సహకార సంఘం సంయుక్తంగా రైతు సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి అభిమాన్యుడు హాజరై రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డి, అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనుబాబు, ఏవో పాల్గొన్నారు.

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

బయ్యారం, జూలై 1 :పోషకాలు కలిగిన ఆహారం తీసుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని బయ్యారం ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. జగ్గుతండా, బయ్యారం 7వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం విలేజ్ హెల్త్ శానిటైజేషన్ మరియు న్యూట్రీషన్ (వీహెచ్‌ఎన్‌ఎస్‌డి) ప్రోగ్రాం నిర్వహించారు. అందులో భాగంగా పలువురు మహిళలు, గర్భిణీ స్త్రీలు, బాలెంతలకు పోషకాహార వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్లు ముకుంద, లలిత, గ్రామ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులను అభినందించిన అనంతరం మాట్లాడుతున్న డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 1 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం అందించి ప్రోత్సహించడం అభినందనీయమని డీఈవో రామారావు అన్నారు. మహబూబాబాద్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా వారి కుమారుడు నూకల మహేందర్‌రెడ్డి 2023-24 విద్యాసం వత్సరం పదవ తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేశారు. పాఠశాల పూర్వవిద్యార్థి డాక్టర్ భూక్య వెంకట్రాములు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ బూలక్ష్మీ, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, సోహన్, కాసం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డీఎంహెచ్‌వో కళావతి బాయి

మహబూబాబాద్ టౌన్, జూలై 1: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వైద్యాధికారిణి కళావతిబాయి అన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో జిల్లా సంక్షేమశాఖ, వైద్యశాఖల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే(వీహెచ్‌ఎస్‌ఎన్డీ)ను మహబూబాబాద్ శివారు వేల్పుల సత్యంనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార దినోత్సవాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా హాజరైన డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశుసంక్షేమఅధికారి వరలక్ష్మి, డాక్టర్ కిరణ్‌మై, హెచ్‌ఎం రాంజీ, వైద్యసిబ్బంది వొబిలిశెట్టిరామకృష్ణ, మంగమ్మ, రత్నకుమారి, విజయకుమారి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీ పరిధిలోని సోమ్లాతండా, జంగిలిగొండ గ్రామాల్లో విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష మాట్లాడారు. కృష్ణార్జున రావు, వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మునిసిపల్ 22, 36 వార్డుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే (వీహెచ్‌ఎన్‌డీ) ను పురస్కరించుకుని చిన్నారులకు, గర్భిణీలకు కోడిగుడ్లు, బాలమృతం పంపిణీ చేశారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కోడిగుడ్లు, బాలామృతం ప్యాకెట్లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి, డీడబ్ల్యూవో

ఈ కార్యక్రమంలో బస్తీదవాఖాన డాక్టర్ శివకుమార్, డాక్టర్ నర్మద, కౌన్సిలర్లు బి. అజయ్ సారధిరెడ్డి, బి. నీరజ, అశ్వినీ, సుశీల, వరలక్ష్మి, మహేశ్వరీ, సుజాత, సుకర్ణ, వెంకటేశ్వర్లు, సరిత, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

● 26 వార్డు పరిధిలోని సిగ్నల్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వీహెచ్‌ఎన్‌డీ కార్యక్రమంలో కౌన్సిలర్ డౌలాగర్ స్వాతిశంకర్, డాక్టర్ శివ, అంగన్‌వాడీ టీచర్ సరిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 1: భూ పోరాటంలో పేదలకు అండగా నిలబడ్డ వామపక్ష నేతలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు సామ పాపయ్య డిమాండ్ చేశారు. భూపోరాట కేసులో సీపీఐ, న్యూడెమోక్రసీ నాయకులు మానుకోట కోర్టులో సోమవారం హాజరయ్యారు. రేషపల్లి నవీన్, పోచారం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెసా గ్రామసభలు నిర్వహించాలి

కొత్తగూడ, జూలై 1 :ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మండలంలోని ఆదివాసీ గ్రామాలలో పెసా గ్రామసభలు నిర్వహించి పెసా చట్టంపై అవగాహన కల్పించాలని కోరుతూ ఎంపీడీవో రవీంద్రప్రసాద్‌కు తుడుందెబ్బ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్, ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, నవీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందజేత

కురవి, జూలై 1 : కురవి మండలం బీబీనాయక్‌తండాలో విద్యుదాఘాతంతో మృతి చెందిన బోడ కిషన్ కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సోమవారం అందించారు. కిషన్ భార్య అరుణకు రూ.5 లక్షల చెక్కును విద్యుత్‌శాఖ ఏడీ రమేష్ అందించారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ శ్రీను, సబ్ ఇంజనీర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డోర్నకల్, జూలై 1 : డోర్నకల్ మండలం హున్యతండా గ్రామపంచాయతీకి చెందిన భూక్య బిక్కు(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డోర్నకల్ ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హున్యతండాకు చెందిన భూక్య బిక్కు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 11న ఒక్కసారిగా అతడి నోటినుంచి రక్తం వస్తుండడంతో గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అతడిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని యశోద అస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఆదివారం రాత్రి బిక్కు మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి భూక్య గన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ నాగరిక సురక్ష సంహిత కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బిక్కు మృతదేహానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

నర్సింహులపేట, జూలై 1 : మద్యం మత్తులో ఉండి ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్సై సతీష్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన షేక్ పాషా నర్సింహులపేట మండలం పడమటిగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో నర్సింహులపేటకు చెందిన ఆరుగురు వ్యక్తులు మద్యం మత్తులో ఉండి మూడు ద్విచక్ర వాహనాలపై పడమటిగూడెంకు వెళ్లారు. ఈక్రమంలో షేక్‌పాషాపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులు ధర్మారపు రవితేజ, తరాల అఖిల్, మందుల అరవింద్‌లను అదుపులో కి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు చౌడారపు విక్రమ్, ఎర్ర నిఖిల్, ఎర్ర సతీష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

కేసముద్రం, జూలై 1: కేసముద్రం స్టేషన్‌లోని ఎస్‌వీవీ హైస్కూల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్నారని, సదరు స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యతో వ్యాపారం చేస్తున్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మహబూబాబాద్ టౌన్, జూలై 1: మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో మంగళవారం శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి హమేంద్రదేవి, సీతారాంరెడ్డి సోమవారం తెలిపారు. అందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 2న క్రోధి నామ సంవత్సర జేష్ఠ బహుళ ఏకాదశి రోజున ప్రథమ వార్షికోత్సవాన్ని జరిపేందుకు వేద పండితులు నిర్ణయించారు.

నర్సరీల తనిఖీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 1 :మహబూబాబాద్ మండలంలోని శ్రీ నందన నర్సరీని సోమవారం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల చట్టం ప్రకారం.. నాణ్యమైన మిర్చి నారు, మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు అందించాలన్నారు. నర్సరీ చట్టం ప్రకారం.. నిబంధనలు పాటించాలని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

హైదరాబాద్‌కు తరలిన మానుకోట గిరిజనులు

నెహ్రూసెంటర్, జూలై 1 : బంజారాల జాతీయ ఆత్మీయ సమ్మేళనంకు మానుకోట జిల్లా నుంచి గిరిజనులు సోమవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్ బోడ లక్ష్మణ్‌నాయక్, భూక్య మోహన్, గుగులోతు వెంకట్, రవినాయక్, మంగీలాల్‌నాయక్, వెంకట్రాం, గిరిజన నేతలు ఉన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్లను సస్పెండ్ చేయాలి: ఎస్‌ఎఫ్‌ఐ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 1: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించని బీసీ హాస్టల్ వార్డెన్‌లను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామికి సోమవారం వినతి పత్రం అందజేశారు. గుగులోతు సూర్యప్రకాష్, జ్యోతిబసు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : నూతన చట్టాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ టౌన్ ఎస్సై అరుణ అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష అధినియం-2023పై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. అందులో భాగంగానే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద టౌన్ ఎస్సై అరుణ నేతృత్వంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

ఎస్పీని కలిసిన ఏఎస్సై శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్, జూలై 1 :ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఇటీవల ఏఎస్సైగా పదోన్నతి పొందిన పి.శ్రీనివాసరావు మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇంటి స్థలం ఆక్రమించుకున్నారని నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న లక్ష్మయ్య కుటుంబసభ్యులు

నెల్లికుదురు, జూలై 1 :నెల్లికుదురు మండల కేంద్రంలో 2 గుంటల ఇంటి స్థలాన్ని ఓవ్యక్తి ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండల కేంద్రానికి చెందిన హెచ్ లక్ష్మయ్య కుటుంబ 'భ్యులతో సోమవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తంచే శారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు హెచ్.లక్ష్మయ్య మాట్లాడుతూ తన సోదరుడు నరేందర్ కుమార్ తనకున్న 2 గుంటల ఇంటి స్థలాన్ని ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నాడని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపు సొసైటీ మహాజన సభ

కొత్తగూడ, జూలై 1 : ఈనెల 3న(రేపు) మండలంలోని పొగుళ్లపల్లిలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మహజన సభ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ దేశిడి శ్రీనివాసరెడ్డి, సీఈవో నల్లకూరి వెంకన్న పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహజనసభలో రైతుబంధు, రైతు భరోసాపై రైతులకు అధికారులు సూచనలు ఇస్తారన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మహజన సభను జయప్రదం చేయాలని కోరారు.